
కథా నిలయం





# సొట్టోడు

- కె.తాయారమ్మ

సొట్టోడు ఆలోచిస్తున్నాడు వీధి గుమ్మంలో కూచుని. వాడికి బతుకుమీద రోత పుడుతోంది! "సీ ఎదవ జలమ!" అనుకున్నాడు.

లోపలికి తొంగి చూశాడు. డిమ్ లైట్లు వెలుగుతున్నాయి. వచ్చినవాళ్ళందరూ కడుపెక్కా తిని మేడపైకి పోయారు! "ఈళ్లు రాచ్చసులా మడుసులా?" అనుకున్నాడు ఒకసారి!

మెల్లగా మేడెక్కేడు! వాళ్లందరూ గున్న ఏనుగుల్లా పడి వున్నారు! తాగిన గ్లాసులు, జీడిపప్పులు తిన్న ప్లేట్లు అన్నీ చిందర వందరగా పడి వున్నాయి! "ఈళ్లు నిజంగా ఆడోళ్లేనా?" రోతగా చూశాడు వాళ్లవైపు!

గ్లాసులు, ప్లేట్లు తీసుకుని కిందికి దిగాడు! "ఒరే సొట్టోడా గొప్పోళ్లింట్లో పనిరా! నెలకి రెండొందలిత్తారు! "ఓ పూట బువ్వెడతారు! సేత్తావా?" అని సిట్టెమ్మత్త సెప్తే ఈడ పనికి కుదురుకున్నాడు! "గొప్పోళ్లంటే ఈళ్లా?"

మెల్లగా భోజనాల హాల్లోకెళ్లాడు! అక్కడ టేబులంతా అడివిలా వుంది! ఖరీదైన హోటల్ నించి ఖరీదైన భోజనాలు తెప్పించుకుని తిన్నది తిని మరి కొంత కిందా మీదా పోసి వినోదం చేసుకున్నారు ఆ ఖరీదైన మనుషులు.

"అవన్నీ తను సుభ్రం చెయ్యాలి!" సొట్టోడికి ఏడుపొచ్చింది. అప్పటికి రాత్రి పన్నెండు గంటలయ్యింది.

"ఒరే సొట్టోడా ఇవన్నీ సుభ్రం చేసి మిగిలినవన్నీ తిను!" "ఈరోజు ఇంటికెళ్లకు!" అంటూ ఆజ్ఞ జారీ చేసింది ఇంటి ఓనరు భ్రమరాంబ!

"ఆవిడ గొప్ప మడిసి!" చిన్నగా నవ్వుకున్నాడు సొట్టోడు.

ఆకలి నకనకలు వాణ్ణి నిలవనియ్యడం లేదు! చిందర వందరగా పడి వున్న ఆహార పదార్థాల దగ్గరగా వెళ్లేడు. వాటిని తీసి ప్లేట్లో వేసుకున్నాడు. ముక్కు దగ్గరగా పెట్టుకున్నాడు. అవి తెచ్చినప్పుడున్న ఘుమ ఘుమలు ఇప్పుడు లేవు!

దాదాపు కంపుకొడుతున్నాయి! "సీ!"అని కింద గిరవాటేశాడు! "గొప్పోళ్లు తిన్న తిళ్లు ఇప్పుడు కుక్కలు కూడా తినవు!"

ఒక్కసారి గడియారం వైపు చూశాడు.

అప్పుడే ఒంటిగంట చూపిస్తోంది గడియారం.

"రోజు గడిచిపోతే కూడెందుకు బాగుంటాది?"అనుకున్నాడు సొట్టోడు!

"వాడికి టైము చూడడం వచ్చు!"

అది ఇంటి యజమానురాలు భ్రమరాంబే నేర్పించింది.

బిందె దగ్గరకెళ్లి గ్లాసుడు నీళ్లు ముంచుకు తాగాడు! అయినా ఆకలి తగ్గలేదు! హాల్లో కార్పెట్ మీద ముణగదీసుకున్నాడు! కడుపు నిండుతేనే నిద్రపడుతుంది! లేకపోతే అదే కరవౌతుంది!"

సీతాలత్త దగ్గరకెళ్లి కూడు తిందామనుకున్నాడు! కాని... కాని...

అమ్మగోరు "ఏడకీ ఎల్లకురా సొట్టోడా!" అంది. అందుకే సీతాలత్త కాడికెళ్లి కూడు తినలేదు! "సీతాలత్త పచ్చడి మెతుకులు పెట్టినా పరమాన్నంలా వుంటుంది!" నిజంగా సీతాలత్త దేవత! "ఒరే సొట్టోడా నువ్విచ్చే డబ్బులు దేనికీ సాలవురా!" నీకు వుట్టి పచ్చడి మెతుకులే పెడుతున్నాను! మిగిలినోళ్లు డబ్బులెక్కువిచ్చి సేపల పులుసు, బొమ్మిడాల కూర, పప్పుచారు అన్నీ సేయించుకుంటున్నారు! "సేసుకున్నమ్మకి సేసుకున్నంత!"అంటూ నిట్టూరుస్తుంది!

సీతాలత్త తన్లాటి దిక్కుమాలినోళ్లకి, పేదోళ్లకి కమ్మగా వొండి పెడుతుంది! "అందరూ ఆమెకి డబ్బులిత్తారు! ఎక్కువ డబ్బులిచ్చినోళ్లకి ఎక్కువ, తక్కువ డబ్బులిచ్చినోళ్లకి తక్కువ వొండిపెడుతుంది!

సీతాలత్తకి ఓ గుడిసుంది! రేతిరి అందరూ ఆడకుచేరి సీతాలత్త సేతి వొంట తింటారు!

"రేతిరి అందరూ సీతాలత్త దగ్గిర తినుంటారు! తానిక్కడ సిక్కొడి పోనాడు!" సింతకాయ పచ్చడి, నిమ్మకాయ ముక్క, చారుతో కడుపు నింపుతాది సీతాలత్త! ఆయిగా నిద్దరొడతాది!" మారమ్మ తల్లి గుడి ముందు సిమెంటు సపటా మీద పడుకుంటాడు తాను!

"ఏటోయిదంతా?" ఈయమ్మ తన్ని కదల్నియ్యడం నేదు!

భళ్లున తెల్లవారింది. ఏ తెల్లారగట్లకో చిన్న కునుకు పట్టిన సొట్టోడికి. "ఏరా సొట్టోడా రాత్రి కడుపెక్కా తిని దున్నపోతులా పడుకున్నావా?"అన్న యజమానురాలి కేకతో త్రుళ్లి పడి లేచాడు సొట్టోడు!

వాడికి కళ్లు చీకట్లు కమ్ముతున్నాయి! ఒంటిని నిసత్తువ ఆవహించింది! లేవ లేక పోతున్నాడు. నిన్న పొద్దున్నెప్పుడో తిన్న రెండు మెతుకులు! "అమ్మో!" అన్నాడు మెల్లగా గోడ పట్టుకు లేస్తూ.

"ఏరా లేవలేకపోతున్నావా?" రాత్రి తిన్న తిండి ఇంకా అరగలేదా? "నీ జన్మలో అలాటి తిండి తినగలవురా?" మరోసారి హుంకరించింది యజమానురాలు భ్రమరాంబ.

బలం కూడదీసుకుని లేచి నిలుచున్నాడు. విపరీతమైన నీరసం ముంచుకొచ్చింది. దబ్బున పడ్డాడు.

"ఏరా ఏమైంది నీకు?" వాణ్ణి పట్టి లేపింది. లేచి నిటారుగా నిలుచున్నాడు. మోకాళ్లు ముందుకు పొడుచుకొచ్చినట్లున్నాయి. వాడు ఎక్కువసేపు నిలబడలేడు.

పోలియోతో వాడి కాళ్లు రెండూ చచ్చుబడిపోయాయి చిన్నప్పుడే! అమ్మానాన్నా చిన్నప్పుడే పోయారు! గాలికి పుట్టి దూళికి పెరిగాడు. ఓసారి నడుస్తాడు. ఓసారి దేకుతాడు.

ఊర్లోని అల్లరి పిల్లలతో కూడి గోళీలాడుతూ, ఎవ్వరైనా దయతలచి ఏదైనా పెడితే తింటూ, ఏ చిన్నతప్పుకైనా దెబ్బలు తింటూ ఏడుపొచ్చినప్పుడు ఏడ్చి నవ్వొచ్చినప్పుడు నవ్వి, నిద్దరొచ్చినప్పుడు నిద్దరోయి, ఆకలేసినప్పుడు వుంటే తిని, లేకపోతే డొక్కలో కాళ్లు పెట్టుకుని ముడుచుకుపోయి ఏదోలా కాలం గడుపుతున్న వీడిమీద జాలితో నాలుగిళ్లలో పాచి పనిచేసుకునే చిట్టెమ్మ సొట్టోడికీ యిల్లు చూపించింది.

రెండేళ్లబట్టీ యీ యింట్లో పనిచేస్తున్నాడు సొట్టోడు.

వాణ్ణి సొట్టోడనే పిలుస్తారు అందరూ. వాడి పేరు ఎవరికీ తెలియదు!

"వాడి పేరు వాడికే తెలియదేమో అసలు!"

భ్రమరాంబ ధనవంతురాలు. ఈమె బాధపడలేక ఈవిడ గారి భర్త సన్యాసుల్లో కలిసి పోయాడంటారు చాలామంది. ఉన్న ఒక్క కొడుకు అమెరికాలో స్థిరపడ్డాడు. "ఈవిడగారు అక్కడికెళ్లదు!" ఆ కొడుకుగారు ఇటు రాడు! భ్రమరాంభ స్వేచ్ఛా జీవి!

ఆవిడ చాలా ఏళ్ల క్రితం సినిమాల్లో చిన్నాచితకా వేషాలు వేస్తూ వుండేదట! ఈమె అందంగా వుండడం చూసి ఓ ధనవంతుడు ఈమెని పెళ్లాడి ఇక్కడికి తీసుకొచ్చాడట! డబ్బు ఖర్చుపెట్టడం, విచ్చలవిడిగా తిరగడం ఇవన్నీ ఆవిడగారి అలవాట్లు. ఆ ధనవంతుడు కొంచెం అమాయకుడు. అతనికి ఆవిడగారు మందు పెట్టిందని, ఆస్తిపాస్తులన్నీ తన పేరు రాయించుకుందని రకరకాలుగా చెప్పుకుంటారు లోకులు!

ఆవిడకి పనిపిల్లాడు కావాలంటే సొట్టోణ్ణి కుదుర్చింది చిట్టెమ్మ. సొట్టోడికి పదహారేళ్లు! కాని... కాని వాడు పన్నెండేళ్ల వాడిలా కనుపిస్తాడు!

"ఏరా సొట్ట వెధవా ఏవిటాలోచిస్తున్నావు?" గచ్చు అలికి తడి గుడ్డ పెట్టు!... అంటూ గదమాయించింది భ్రమరాంబ.

ఉలిక్కి పడి లేచాడు సొట్టోడు. ఒళ్లు తూలుతోంది! పెరట్లోకి నడిచి బకెట్టుతో నీళ్లు గుడ్డ తెచ్చాడు. ఓసారి కూచుని ఓసారి వంగి ఇల్లు రాస్తున్నాడు. మధ్యమధ్యలో లేచి నిలుచుంటున్నాడు! అలా నిలుచున్నప్పుడు వాడి మోకాళ్లు ముందుకి నిక్క పొడుచుకొచ్చినట్లుంటాయి!

వాడు ఒక్కసారి తూలిపడ్డాడు.

"ఏరా వెధవా అలా తూలిపడ్డావు?" తిన్నదరగలేదా? మళ్లీ గదమాయించింది భ్రమరాంబ.

"తను ఒక్క పిసరు కూడా తిన్లేదని ఈవిడకెట్టా తెలుస్తాది?" కడుపెక్కా తిన్నానని తిడ్తోంది!" "తనక్కావల్సింది ట్టాంటి తిండి కాదు" కడుపు నిండె గెంజి బువ్వ సాలు! "ఒళ్లు బలిసే తిండి తనకొద్దు!"

నాలుగు తిట్టుకుంటూ మేడమీదికి పోయింది భ్రమరాంబ. అలా ఎంతసేపు పడివున్నాడో సొట్టోడు. వంట వాడు గోవిందం వొచ్చి "ఇందరా సొట్టోడా!" అంటూ రెండు ఇడ్లీలు, టీ యిచ్చాడు!

ఆ ఇడ్లీలు తొలిరోజువి! గట్టిగా వున్నాయి. అయినా తిన్నాడు. కొంచెం సత్తు వొచ్చింది. మెల్లిగా లేచి మిగిలిన పని పూర్తిచేశాడు.

పగలు గోవిందం వండుతాడు. ఒంటి గంటకి భోజనం చేసి మేడ మీదికెళ్లి నిద్రపోతుంది యజమానురాలు. మిగిలినది తనకి కొంచెం పెట్టి మిగిల్నిన్నది ఇంటికి చేరవేస్తాడు గోవిందం!

"ఎందుకో తనకా తిండి యిష్టం వుండదు!"

భ్రమరాంబ నాలుగు గంటలకి తయారయి కార్లో ఏ క్లబ్బుకో వెళ్ళిపోతుంది! రాత్రి ఏ తొమ్మిది గంటలకో, పది గంటలకో యింటికొస్తుంది! అక్కడే తిని వస్తుంది! వారానికోసారి పార్టీలు జరుగుతాయి!

సొట్టోడు మాత్రం రాత్రి ఎనిమిది గంటలవరకూ వుంటాడు. నైట్ వాచ్‌మేన్ సాంబయ్య రాగానే వెళ్లిపోతాడు. అప్పుడే వాడికి స్వేచ్ఛ లభిస్తుంది!

సీతాలత్త పెట్టిన కూడు తిని హాయిగా నిద్రపోతాడు.

రాత్రి ఎనిమిది గంటలయ్యింది! క్రితం రోజునించి సరియైన తిండి తినలేదు సొట్టోడు. "బేగెల్లి సీతాలత్త సేతి కూడు తినాల!" అనుకున్నాడు సొట్టోడు.

"సొట్టోడా ఇంకెల్లరా!" అన్నాడు సాంబయ్య వస్తూనే! ఎగిరి గంతేశాడు సొట్టోడు.

ముందు గేటు దగ్గర గూర్ఖా వుంటాడు. ఇంట్లో సాంబయ్య వుంటాడు. సాంబయ్య దగ్గర బాగా చనువు సొట్టోడికి! "ఉండు సాంబయ్యా!" అంటూ తుర్రుమన్నాడు సొట్టోడు.

సీతాలత్త ఇంటికెళ్లేసరికి కొంత మంది అన్నాలు తింటున్నారు. వాడికి ఆకలి నకనకలు ఎక్కువయ్యాయి! నోరూరుతోంది సీతాలత్త వంట చూస్తూ వుంటే.

"రారా సొట్టోడా!" నిన్న ఏడకిపోయినావు? అంది ఆప్యాయంగా.

సీతాలత్త ఆప్యాయతతోనే కడుపునిండిపోతుంది. ఆమె పెట్టేది అన్నం కాదు! అమృతం! అనుకుంటారు అక్కడ తింటున్న వాళ్లంతా.

సీతాలత్త కంచం నిండా అన్నం పెట్టి చేపల పులుసు పోసింది.

ఆశ్చర్యంగా చూశాడు సొట్టోడు. తిన్రా సొట్టోడా నిన్న అస్సలు వణ్ణమే తిన్లేదుగా నాకాడ! అంది.

సొట్టోడి కళ్లల్లో నీళ్లు ఊరాయి. క్రితంరోజు తాను కూడు తిననందుకు ఈరోజు ముదరాయిచ్చింది సీతాలత్త! "నిజంగా సీతాలత్త నీతున్న మడిసి!" అనుకున్నాడు.

చేపల పులుసు తాలూకు ఘుమఘుమలు వాడి ముక్కుపుటాల్ని తాకుతున్నాయి. గబగబా అన్నం కలుపుకుని ఆబగా తిన్నాడు సొట్టోడు. కొసరి కొసరి వడ్డించింది సీతాలత్త.

హాయిగా తిని, బ్రేవ్‌మని తేన్చి మారమ్మ తల్లి గుడికాడికెల్లి అక్కడ రాతి చపటా మీద పడుకున్నాడు సొట్టోడు.

ఆకాశంలో చంద్రుడు చల్లగా సాగుతున్నాడు. వెన్నెల వెలుగులు పరిసరాలను తడుపుతున్నాయి.

ఆకాశంవైపు రెప్పవాల్చకుండా చూస్తున్నాడు సొట్టోడు. "ఈ రేతిరి ఎంత బాగుండాది! ఈడున్న సంతోసం ఏడుంటాది?"

"ఆ గొప్పోళ్ళ యిళ్లల్లో అసలు సుకం, సంతోసం వుంటాదా? కరెంటు మీదొచ్చేగాలి, ఈ గాలితో సరితూగుద్దా? ఆడున్నంతసేపు సిరాకే!

ఒక్కసారి వాడికి "తింగ" గుర్తొచ్చింది! "తింగ వోరు? తానోరు?" "తింగ శానా మంచి పిల్ల!" ఒక సంవత్సరం గతంలోకెళ్లింది వాడి మనస్సు!

**బొల్లన్ని దుకాణాలు, బొమ్మలు, రబ్బరు బూర్లు, పిల్లనగగ్రలు, పీచుమిఠాయిలు, పంచదార సిలకలు, కరుజూరం, సెనగలు, ఓవైపు సర్కసు, ఇంకోవైపు రంగులరాట్నం; అమ్మో ఎన్నో... వాడి ముందు ఓ కొత్త లోకం ఆవిష్కృతమయ్యింది!**

అప్పుడు ఊళ్లో శానామందెళ్తా వుంటే, రావులోరి పెళ్లికి రామగుళ్లు యేళ్లేడు తనుకూడా! అంతా కొత్త! ఆడ శానా బాగుంది! జనం మద్దెలో నడుత్తున్నాడు తను!

బోల్డన్ని దుకాణాలు, బొమ్మలు, రబ్బరు బూర్లు, పిల్లనగ్రలు, పీచుమిటాయిలు, పంచదార సిలకలు, కరుజూరం, సెనగలు, ఓవైపు సర్కసు, ఇంకోవైపు రంగులరాట్నం; అమ్మో ఎన్నో... వాడి ముందు ఓ కొత్త లోకం ఆవిష్కృతమయ్యిది!

రూపాయిచ్చి మిటాయి వాచీ కట్టించుకున్నాడు చేతికి. దానికి ఇటూ అటూ తిప్పి చూసుకున్నాడు పదిసార్లు! "ఇది అమ్మగోరు వోచి కంటే బాగుండాది!" అనుకున్నాడు.

"వాడు అల్ప సంతోషి!" వాడికి ఖరీదుతో పని లేదు. క్షణంలో కరిగిపోయే ఈ వాచీకీ, వేల ఖరీదు చేసే ఆ వాచీకి తేడా తెలియదు వాడికి!

అందరితోపాటే వెళ్లి కోనేట్లో స్నానం చేశాడు. తిరిగి వస్తా వుండగా, "నామం ఎట్టాలా?" ఓ గొంతు వినిపించింది.

అటు చూశాడు సొట్టోడు.

లంగా, జాకెట్టు వేసుకున్న ఓ పిల్ల కూచుని వుంది ఆ చెరువు గట్టుమీద.

సొట్టోణ్ణి చూసి నవ్వింది.

సొట్టోడు కూడా నవ్వేడు.

అక్కడ చాలామంది తిరునాళ్లకొచ్చిన యాత్రికులకి తెల్లని సుద్దతో నామం, దాని మధ్య సిందూరం రంగు బొట్టు పెడుతున్నారు! బొట్టు పెట్టించుకుని వాళ్లంతా దేవుడి దర్శనానికి పోతున్నారు.

తింగ దగ్గరకెళ్లి బొట్టు పెట్టించుకున్నాడు. "నీదేవూరు?"

"పక్కూరే!" పట్నం! అన్నాడు సొట్టోడు.

"నీ పేరేమిటి?"

"సొట్టోడు".

"సీ! అట్టాగనకూడ్దు!" మీ అమ్మా, అయ్యా పెట్టిన పేరు?"

"ఏమో నాకు తెల్దు!" నాకు సేన వొచ్చినప్పట్నుండీ అందరూ సొట్టోడనే పిలుత్తన్నారు!"

"సరే!" ఇదిగో అద్దం సూసుకో!" ఓ చెక్క అద్దం వాడి చేతిలో పెట్టింది తింగ.

అద్దంలో మొహం చూసుకున్నాడు సొట్టోడు. మొహం కొత్తగా కనుపించింది. చిన్నగా నవ్వుకున్నాడు. "నామం బాగుంది!" అన్నాడు తింగతో.

ఈసారి 'తింగ' నవ్వింది "ఎల్లు!" దేవుణ్ణి సూసిరా!" అంది ఇంకో మడిసివైపు తిరిగి నామం దిద్దుతూ.

అక్కడ చాలామంది మూఢ భక్తితో పిల్లా, పిచికా, పెద్దా, చిన్నా, ఆడా మగా అందరూ నామాలు పెట్టించుకెల్తున్నారు!

పాడు మొహంతో దేవుడి దగ్గరకెళ్లకూడదన్నది వాళ్ల సిద్ధాంతం!

సొట్టోడు టికెట్టు కొనుక్కుని మెల్లగా క్యూలో దూరాడు.

తింగ అటువైపు తిరిగి, మళ్లీ తన పనిలోతాను నిమగ్నురాలయ్యింది.

గంటలు గడుస్తున్నాయి. భక్తుల రద్దీ ఎక్కువవుతోంది.

రాములోరి పెళ్లి చూసుకొని తిరిగొచ్చాడు సొట్టోడు.

అప్పుడు రాత్రి దాటింది. తెల్లారగట్ల మూడు గంటలయ్యింది. తింగ ఓ చిన్న చెక్క బెంచీ మీద ముడగదీసుకు పడుకుంది.

"మా ఊరెల్లిపోతున్నాను!" అన్నాడు నెమ్మదిగా.

ఉలిక్కి పడి లేచింది తింగ. ఇప్పుడు బస్సులు రద్దీగుంటాయి!

రేపెల్దువులే! "మా ఇల్లు ఈడకి దగ్గరే!" రావెల్దాం! అంది.

ఎందుకో సొట్టోడంటే తింగకి జాలి, ప్రేమ కలిగాయి.

"నేన్రావొచ్చా?"సందేహంగా అడిగాడు సొట్టోడు.

"ఎందుకు రాకూడ్దూ?"అంటూ వాడి చెయ్యి పట్టి వాళ్ల ఇంటివైపు నడిపించింది.

"అవ్వా పట్నం నించొచ్చాడు!" పాపం సొట్టోడు! ఇప్పుడీడుండి రేపెల్లిపోతాడు!" అంది ఓ వృద్ధురాలిని ఉద్దేశించి.

"రారా కుర్రోడా!"అంటూ ఆప్యాయంగా పిల్చింది ముసల్ది.

వాడి యోగక్షేమాలడిగి సీ వెండి గిన్నెతో గెంజి బువ్వ తెచ్చి వాడి ముందు పెట్టింది. "తిను!" ఈడ మెతుకులు దొరకవు! సిన్న సిన్న వాటేల్లున్నా బోల్డు డబ్బులడుగుతారు! అంది.

పొద్దుటినించీ ఏమీ తినలేడు వాడు. రెండు మెతుకులు ఊరగాయ బద్ద నంచుకు తిని కడుపి నిండా గెంజి తాగాడు.

కడుపులో చల్లగా వుంది. కంటి నిండా నిద్ర పట్టింది.

నిద్ర లేచేసరికి బారెడు పొద్దెక్కింది.

తింగ కనుపించలేదు! నాలుగు దిక్కులా చూశాడు. అవ్వని అడిగాడు.

కోనేటి కాడికెల్లింది "నువ్వూ ఎల్లు!" అంది.

సొట్టోడు మెల్లగా నడుచుకుంటూ కోనేటి దగ్గరకెళ్లాడు. తింగ మళ్లీ తన పనిలోతాను మునిగి వుంది.

"నానెల్లి పోతన్నాను!" అన్నాడు ఎదురుగా నిలబడి. "ఇంద ఈ డబ్బులు తీసుకో!" ఓ పది రూపాయల నోటు జేబులోంచి తీసి ఇయ్యబోయాడు.

"ఎందుకు?" అంది తింగ.

"రేతిరి బువ్వెట్టావుగా!" అన్నాడు సొట్టోడు నేల చూపులు చూస్తూ.

"బువ్వెట్టినందుకు డబ్బులిత్తావా?" వొద్దు! "నువ్వు నా సేయితుడివి!"

"నువ్వంటే నాకిట్టం!" నన్ను యాదెట్టుకో! అంది తింగ దాని కన్నులలో నీరు సుడులు తిరిగింది.

"తింగకి తనంటే ఇట్టవా?" వాడి కన్నులలో నీళ్లు నిండుకున్నాయి! అవి ఆనందంతో నిండిన నీళ్లు.

(మిగతా 20వ పేజీలో)

(9వ పేజీ తరువాయి)

"వొత్తాను తింగా!" మా అమ్మగోరు కేకలేత్తారు!" నానె ల్లాల!"

"అమ్మగోరా?" వోరు?

"గొప్పింటమ్మగోరు!" నా నెల్తున్నా! వెనక్కి వెనక్కి చూసుకుంటూ వెళ్లి బస్సెక్కాడు!" మళ్లీ రావులోరి పెల్లికి రా!" అన్న తింగ మాటలు చెవులను సోకుతుండగా.

"తింగ తన సేయితురాలు!" తింగ తన సేయితురాలు! అంటూ గట్టిగా అరిచేడు.

"ఏట్రా సొట్టోడా కలగంటున్నావా?" ఏటి కలో? అంటూ పక్కన వచ్చి చేరాడు జంగాల చంటిబాబు!"

ఒక్కసారి గతంలోంచి వర్తమానంలోకొచ్చేడు సొట్టోడు.

"ఏటొకెదునే!" అంటు వెనుదిరిగాడు సొట్టోడు. వాడిలో ఓ ఆలోచన రూపుదిద్దుకుంటోంది!" మరో వారంరోజుల్లో జరగబోయే రాములోరి పెళ్లికి రామగుళ్లు వెళ్లాలని!"

రామ దర్శనానికి ముందు ఇంకో దర్శనం కావాలి వాడికి. 'అది తింగ దర్శనం!"

"మళ్లీ తింగని సూడాలి!" నామం ఎట్టించుకోవాలి! అను కుంటూ నిద్రలోకి జారిపోయాడు సొట్టోడు.

"సొట్టోడా కూరలు పట్రా!"అంటూ వంద రూపాయల నోటు వాడి చేతిలో పెట్టింది ఇంటి యజమానురాలు భ్రమ రాంబ!

చేతిలో సంచి డబ్బులతో వీధిలోకొచ్చాడు సొట్టోడు.

నాలుగడుగులు నడిచేసరికి కొంతమంది మనుషులు గుంపుగా వుండడం కనిపించింది. జనం మధ్యలో దూరి సూశాడు. అక్కడో స్త్రీ చచ్చిపడి వుంది! దగ్గరగా వెళ్లి సూశాడు. ఆమె రోజూ ఆ వీధిలో అడుక్కునే పున్నమ్మ సెక్కులేని చావు చచ్చింది.

పున్నమ్మ చాలా మంచిది. ఎవరైనా పెడితే తినేది. లేక పోతే కడుపులో కాళ్లు పెట్టుకు పడుకునేది! అప్పుడప్పుడు తనతో మాట్లాడుతూ వుండేది! తను డబ్బులు వేస్తూ వుండే వాడు దాని జోలెలో.

అలాటి పున్నమ్మ ఇవాళ రోడ్డుమీద నిర్జీవంగా పడి వుంది. జాలి లాంటిది కలిగింది సొట్టోడికి.

"ఒరే సొట్టోడా డబ్బులు దండ్రా అందరి దగ్గరా!"అంటూ ఎవరో ఓ సీవెండి పళ్లెం యిచ్చి హుకుం జారీచేశారు.

అసలు పని మరచిపోయాడు సొట్టోడు.

రోడ్డుమీద పోయే అందరి దగ్గరా డబ్బులు దండసాగేడు. చాలా డబ్బులే కూడాయి. సూరీడు నడి నెత్తికొచ్చాడు. సొట్టోడి ఒంటి నిండా చెమటలు కారుతున్నాయి. నోరు పిడచ కట్టుకుపోతోంది. అయినా వాడు బాధ పడలేదు. వాడిలో ఓ దృఢ సంకల్పం చోటుచేసుకుంది. అమ్మ గారిచ్చిన వంద రూపాయలతోపాటు మరి కొంత వేశాడు పళ్లెంలో.

"అంతే!" తరువాత జరగవలసినదంతా జరిగింది.

రాత్రి ఎనిమిది గంటల ప్రాంతంలో ఇంటికొచ్చాడు సొట్టోడు.

అప్పటివరకు వాడు పచ్చి మంచినీళ్లు కూడా తాగలేదు! వాడి కళ్లు అగ్ని గోళాల్లా వున్నాయి ఎర్రగా.

రోజూకంటే ముందే ఇంటికి వచ్చిన యజమానురాలు భ్రమరాంబ బెబ్బులిలా గర్జించింది. "ఏరా ఒళ్లు కొవ్వె క్కిందా?"

"నేనెక్కడికి పంపించానో గుర్తుందా?" ఇవాళ కూర లేకుండా భోజనం చేశాను! "ఏవీ వంద రూపాయలు?"

"లేవమ్మగారూ!"

"ఏమయ్యాయి?" ఏమైనా కొనుక్కు తిన్నావా?" తిన్న తిండి ఎక్కువయి ఒళ్ళు బరువెక్కింది నీకు? ముందు డబ్బులు కక్కు! "బెల్టుతో వాణ్ణి కసితీరా బాదింది ఆ గొప్పింటి మహిళ.

వాడి కళ్లు బైర్లుకమ్మాయి. నీరసం నిస్సత్తువ ఆవహిం చాయి వాణ్ణి. "అమ్మగోరూ కొట్టమాకండి!" అంటూ అరు స్తున్నాడు వాడు.

ఆమె మనసు కరగ లేదు! మళ్లీ మళ్లీ కొట్టింది. వాడు కింద పడిపోయాడు.

"ఛీ వెధవలు! నీచులు! నీచమైన బుద్ధులు!"అను కుంటూ మేడపైకి వెళ్లిపోయింది.

ఒంటి మీద తెలివి లేకుండా నేలమీద పడి వున్నాడు సొట్టోడు.

అలా ఎంతసేపు పడివున్నాడో వాడికే తెలియదు! ఏ రాత్రికో గోవిందం వచ్చి వాణ్ణి లేపి ఇంత చారూ అన్నం పెట్టాడు.

రోడ్డుమీద పోయే అందరి దగ్గరా డబ్బులు దండసాగేడు. చాలా డబ్బులే కూడాయి. సూరీడు నడి నెత్తికొచ్చాడు. సొట్టోడి ఒంటి నిండా చెమటలు కారుతున్నాయి. నోరు పిడచ కట్టుకుపోతోంది. అయినా వాడు బాధ పడలేదు. వాడిలో ఓ దృఢ సంకల్పం చోటుచేసుకుంది.

రెండు మెతుకులు తిన్నాక ఒంట్లో శక్తి వచ్చింది సొట్టోడికి.

"ఇంక ఈడ వుండకూడదు!"అనుకున్నాడు.

"అయినా తనేం తప్పు సేసేడు?" ఎన్ని మాట్లాడింది అమ్మగోరు?" సీ ఎదవ జలమ! వాడి మీద వాడికే విరక్తి వచ్చింది.

ఇంక సీతాలత్త దగ్గిరకి కూడా వెళ్లలేదు! డబ్బులివ్వందే సీతాలత్త మాత్రం కూడెట్టా ఎడ్తాది?" సేతులో సిల్లిగవ్వ లేదు!"

తెల్లవారింది. వీధిలోకెళ్లాడు. ఎదురుగా చిట్టెమ్మ కనుపిం చింది. "సిట్టెమ్మత్తా!"అని పిలిచేడు సొట్టోడు.

"ఏరా సొట్టోడా!" నువ్వు నిన్న శానా గొప్ప పనిసేసినా వంట!" బిచ్చమెత్తుకొనే పున్నమ్మ సచ్చిపోతే నువ్వే దగ్గ రుండి అన్నీ సేసినావంట! మూడొందల రూపాయలు ఖరుసు సేసినావంట! "అందరూ నిన్నే మెచ్చుకుంట న్నారా!"

"ఒరే నువ్వు సొట్టోడివే కాని, నీ బుద్ధి సొట్టది కాదురా!"అంది చిట్టెమ్మ వాడి భుజం మీద చెయ్యి వేస్తూ.

"సిట్టెమ్మత్తా అమ్మగోరు కొట్టేరు!" తట్లు తేలిన ఒళ్లంతా చూపించేడు.

"ఒరే సొట్టోడా ఆళ్లు గొప్పోళ్లురా!" ఆళ్లు ఏటి సేసినా సెల్లుతాది! మనం ఆళ్ల కాపలా కుక్కలం! ఎల్లు ఓపాలి సీతాలత్త దగ్గరకెల్లిరా! సీతాలత్త శానా మంచిది! అంటూ వెళ్లింది చిట్టెమ్మ.

నాలుగు రోజులు దొర్లాయి. "అమ్మగోరూ సొట్టోడు పస్తులుంటున్నాడు!" అంది చిట్టెమ్మ భ్రమరాంబతో.

"వాడికేం పోయికాలం!" "సొట్టవెధవ మొన్నే జీతం పట్టుకుపోయినాడు కద!"పైగా నేను కూరలకిచ్చిన వంద రూపాయలు కూడా ఖర్చు చేశాడు! "నేను మంచిదాన్ని కనుక వాణ్ణి పనిలోనించి తీసెయ్యకుండా వుంచేను! "వచ్చే నెలలో వాడి జీతంలో వంద రూపాయలు కొట్టేస్తాను!" అంది అధికార దర్పంతో.

"అమ్మగోరూ వాడు డబ్బులన్నీ పున్నమ్మ సావుకి కరుసె ట్టేసినాడు! వాడి సేతిలో సిల్లిగవ్వలేదు!" అంది చిట్టెమ్మ.

ఇంతెత్తున లేచింది భ్రమరాంబ. "దానధర్మాలు చేసేపాటి వాడయ్యాడా వీడు?" సొట్ట వెధవ సొట్ట వెధవలా వుండక వీడికెంత గొప్పొచ్చింది!"

"యీ డబ్బునోళ్లకి కింది మడుసులు అవుపడరు!"అను కుంటూ వెనుదిరిగింది చిట్టెమ్మ.

మరి కొన్ని రోజులు గడిచాయి. సొట్టోడు మౌనంగా తన పని తాను చేసుకుపోతున్నాడు. అయిన దానికీ కాని దానికీ యజమానురాలు "సొట్ట వెధవా!"అంటూ తిడుతూనే వుంది! మధ్యమధ్యలో బెల్టుతో కొడుతోంది!

"ఈ బతుకెన్నాల్లు?" తనలోతనే అనుకున్నాడు సొట్టోడు.

ఆ వీధిలో పనులన్నీ చేసుకొని రోడ్డుమీదికొచ్చి కానా మీద కూచుంది చిట్టెమ్మ.

మెల్లగా చిట్టెమ్మను సమీపించాడు సొట్టోడు.

"ఏరా సొట్టోడా ఏటైనా తిన్నావా?"అని అడిగింది చిట్టెమ్మ.

"లేదు!" అన్నాడు సొట్టోడు తల వంచుకుని.

"ఇంద! ఇది తిను!"అంటూ తన క్యారేజీలోని పురిహోర కొంచెం తీసి క్యారేజి కప్పులో వేసి యిచ్చింది చిట్టెమ్మ.

ఆవురావురావురుమని తిన్నాడు సొట్టోడు.

"ఇంకా కావల్నా?"

"ఒద్దు!" శానా బాగుంది! ఎక్కడిది?

మా అమ్మగారి మనవడి పుట్టినరోజు! "ఆవిడిచ్చారు!" మా అమ్మగారు శానా మంచోరు! అంది చిట్టెమ్మ.

చిట్టెమ్మ ముందు ఏదో చెప్పాలని తటపటాయిస్తూ నిలు చున్నాడు సొట్టోడు.

"ఏట్రా సొట్టోడా!" ఏటికావాల?" ఎందుకట్టా నిలబడి నావు? అడిగింది సిట్టెమ్మ.

"సిట్టెమ్మత్తా ఓ యాభై రూపాయలుంటే యివ్వవా!" నసుగుతూ అడిగాడు.

"ఒసదా!" ఇంద నీకాడున్నప్పుడియ్యి!" బొడ్లో దోపిన యాభై రూపాయల నోటు తీసి మడతలు విప్పి వాడి చేతిలో పెట్టింది.

విజిల్ వేసుకుంటూ వెళ్లి కదులుతున్న ఓ బస్సెక్కాడు సొట్టోడు. వాడి మనస్సు దూది పింజలా ఎగిరిపడుతోంది. మరునాడే రాములోరి పెళ్లి!

సీతారామ కల్యాణం రోజు రామగుళ్లలో కోనేటి గట్టు మీద చిన్న గోనె పరుచుకు కూచుని స్నానం చేసొచ్చిన భక్తులకి నామాలు దిద్దుతోంది తింగ. ఆ పిల్లకి కొంచెం దూరంలో కూచుని సొట్టోడు కూడా నామాలు దిద్దే పనిలో పడ్డాడు.

వాడిప్పుడు హాయిగా వున్నాడు.

తింగ వాడికి ప్రాణ స్నేహితురాలు.

ఇద్దరూ కబుర్లు చెప్పుకుంటూ వుంటారు. ఇద్దరూ కలిసి తింగ ఇంటికెళ్తూ వుంటారు. ఇద్దరూ కలిసి వంట చేసుకుం టారు. తింటారు. ఇప్పుడు అవ్వలేదు!

ఆ ఇంటికి వాళ్లిద్దరే పెద్దలు.

"రాములోరే తామిద్దర్నీ కలిపేడని వాళ్ల నమ్మకం!"

ఇప్పుడు సొట్టోడికేభయం లేదు. ఇప్పుడు వాడు గొప్పిం టోళ్ల కాపలా కుక్క కాదు! కోనేటి గట్టున కూచుని భక్తులకి నామాలు దిద్దుతాడు! పంగనామాలు కాదు! భక్తుల నుదుట బొట్టు.

"ఇప్పుడు సొట్టోడు సొట్టోడు కాదు!"

"గొప్పోడు!" ★